# రైతన్నకు బీఆర్ఎస్ బాసట

## పత్తి రైతుల సమస్యలపై నేడు ఏఎంసీల సందర్శన: తాతా మధు



ఖమ్మం, నవంబర్ 4: అన్నదాతలకు బీఆర్ఎస్ ఎప్పుడూ బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం నిత్యం పాటుపడుతుందని, అందుకోసం ఎల్లవేళలా పోరాడుతుందని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే తాజాగా పత్తి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు శ్రీకారం చుట్టినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించనున్నట్లు చెప్పారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నట్లు వివరించారు. తనతోపాటు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీనియర్ నాయకుడు ఆర్‌జేసీ కృష్ణ సహా ఇతర నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

‘ప్రజావాణి’ దరఖాస్తుల పరిష్కారానికి..

# ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలి

- ఖమ్మం ఐడీవోసీ గ్రీవెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఖమ్మం ఐడీవోసీలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్

మామిళ్లగూడెం, నవంబర్ 4:ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను ప్రత్యేక ప్రాధాన్యంతో వెంటనే పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సందర్భంగా ఖమ్మం ఐడీవోసీలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖల ఉన్నతాధికారులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ తమ సమస్యలపై వినతులు అందించారు. తాను మానసిక వికలాంగురాలినని, తల్లిదండ్రులు చనిపోయారని నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి గ్రామానికి చెందిన కొమ్మరాజు ప్రేమలత కలెక్టర్ వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారు. తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. తాను బీటెక్ పూర్తి చేశానని, సత్తుపల్లి మైనార్టీ గురుకుల కళాశాలలో డీటీపీ ఆపరేటర్‌గా అవకాశం కల్పించాలని మాటూరిపేట గ్రామానికి చెందిన పానెం స్పందన వినతిపత్రం అందించారు. జాతీయ రహదారి విస్తరణలో తన ఇల్లు పోయిందని, అధికారులు సగం నష్ట పరిహారం మాత్రమే చెల్లించారని నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికిన చెందిన సత్యనారాయణ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మిగతా సగం పరిహారాన్ని కూడా మంజూరు చేయాలని కోరారు. అలాగే, వివిధ మండలాల నుంచి ఇంకా పలువురు అర్జీదారులు తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. డీఆర్‌వో రాజేశ్వరి, డీఆర్‌డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మన్యానికి మెడికల్ కాలేజీ ఒక పెద్ద వరం. కానీ.. ఆ మెడికల్ కాలేజీ ఇప్పుడు అవినీతి ఆరోపణలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నెలల తరబడి ప్రతి ప్రజావాణిలో ఫిర్యాదుల పరంపర కొనసాగుతూనే ఉంది. చివరికి ఏసీబీ రైడ్ వరకు వచ్చేసింది. ఇంతకీ మెడికల్ కాలేజీలో అంతపెద్దగా ఏం లుకలుక జరుగుతోందనేది సర్వత్రా ప్రస్తుత చర్చనీయాంశం. సరిగ్గా రెండేళ్ల క్రితం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో భద్రాద్రి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావడంతో ఏజెన్సీవాసులు చాలా సంతోషపడ్డారు. కానీ.. ఆ సంతోషం కాంగ్రెస్ సర్కారు హయాంలో ఎంతోకాలం నిలువలేదు. అవినీతి కంపును మూటకట్టుకుందంటే అక్కడ ఎలాంటి అక్రమాలు జరుగుతున్నాయో వేరే చెప్పనక్కర్లేదు.

- భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ)

# అవినీతి ఆనవాళ్లు!

## లంచాల ఆరోపణలకు చిరునామాగా కొత్తగూడెం వైద్య కళాశాల

- ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం సక్రమమేనా?
- నెలలు తరబడి ఏకధాటిగా అందుతున్న ఫిర్యాదులు
- కొత్తగా 150 పోస్టుల భర్తీ జరిగేనా?
- ఏసీబీ దాడుల వరకూ వచ్చిన వ్యవహారం
- ఆ 23 మంది ఉద్యోగులు ఉన్నట్టా? లేనట్టా?

జిల్లాకేంద్రంలోని కొత్తగూడెంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో కొత్త ఉద్యోగుల నియామకాలకు అవకాశం కలిగింది. అక్కడ నుంచి అక్రమాల ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించుకునే అవకాశం కలగడంతో కొత్తగూడెంలో ఉన్న రెండు ఏజెన్సీలు నియామకాల ప్రక్రియను చేపట్టాయి. ఒక ఏజెన్సీ 220 మందిని నియమించుకోగా.. మరో ఏజెన్సీ 81 మంది ఉద్యోగులను నియమించింది. ఇవన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరిగాయి. అయితే నియామకాల ప్రక్రియపై కొందరు నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. నియామకాలు సక్రమంగా జరగలేదని, సొమ్ములు ఇచ్చిన వారికే ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదులు చేయడంతో అప్పటి కలెక్టర్ విచారణకు సైతం ఆదేశించారు. విచారణలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు బహిరంగ అక్రమాలపై నోరు విప్పకపోవడంతో ఆ విచారణ అక్కడితో నిలిచిపోయింది. దీంతో రెండు ఏజెన్సీల ద్వారా నియమించబడిన ఉద్యోగులకు కొన్ని సందర్భాల్లో వేతనాలు రాకపోవడంతో అప్పట్లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదులు చేయగా.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ సరెండర్ కూడా చేశారు. ఆ సరెండర్ సక్రమం కాదని కలెక్టర్‌పై కూడా ఆరోపణలు వచ్చాయి. అది కేవలం పత్రికలకే పరిమితం అయిపోయింది. పై అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నియామకాల పర్వం నేటికీ ఒక కొలిక్కిరాలేదు.

### 150 పోస్టుల భర్తీ జరిగేనా?

అవుట్ సోర్సింగ్ పోస్టులపై విచారణ అట్లుండగా... మెడికల్ కాలేజీలో మరో 150 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దానిని ఓపెన్ మెరిట్ ద్వారా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగులు వేల సంఖ్యలో దరఖాస్తులు పెట్టుకున్నారు. అయినా అది నేటికీ పూర్తి చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వచ్చాయి. ఏజెన్సీల ద్వారా భర్తీ చేస్తే అక్రమాలు జరుగుతున్నాయని వాటిని మెరిట్ ఆధారంగా భర్తీ చేయాలని నిరుద్యోగులు పట్టుబట్టడంతో చివరికి ఉద్యోగాల నియామకాలు నిలిచిపోయాయి.

### ఏసీబీ రైడ్ వరకు వచ్చిన వ్యవహారం..

చిలికిచిలికి గాలివానలా మెడికల్ కాలేజీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల వ్యవహారం చివరికి ఏసీబీ రైడ్ వరకు వచ్చింది. ఉద్యోగుల జీతాల బిల్లులు చెల్లింపుల్లో కాలేజీ పరిపాలనాధికారి చేతివాటం ప్రదర్శించడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో అక్రమాల పుట్ట ఒక్కసారి కుప్పకూలినట్లయింది. అదేకాక ఉద్యోగుల నియామకాలు సక్రమంగా జరగలేదని కూడా గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడంతో దానికి సంబంధించిన వ్యవహారం కూడా ఏసీబీ దృష్టికి చేరింది. అసలు 23 మంది నియామకాలు ఎందుకు ఆపారు? వారి జీతాలు ఎందుకు ఆపారు? అనేది అర్థంకాని విషయంగా మారింది. ఏజెన్సీల వారు మాత్రం మా ఏజెన్సీ నుంచి ఎవరినీ తొలగించలేదని చెప్తుండగా.. కాలేజీ యాజమాన్యం మాత్రం 23 మంది బదులు వేరే వారిని పెట్టుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్తున్నారు. చివరికి ఆ 23 మంది ఉద్యోగుల నియామకం మిస్టరీగానే ఉంది.

### 23 మందిని మార్చాలన్నారు.

అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించబడిన ఉద్యోగులు 23 మందిని రిప్లేస్ చేయమని కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ప్రక్రియ జరుగుతున్నది. జీతాల బిల్లుల చెల్లింపులు జరిగే క్రమంలో ఏసీబీ రైడ్ చేశారు. ఇతర విషయాలు నాకు తెలియదు.

**– డాక్టర్ రాజ్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్**

### కాలేజీని భ్రష్టు పట్టిస్తున్నారు..



గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. ఇక్కడ పేద విద్యార్థులకు మెడికల్ కాలేజీలో సీట్లు వచ్చాయంటే అది బీఆర్ఎస్ పుణ్యమే. అలాంటి కాలేజీని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో భ్రష్టు పట్టిస్తున్నారు. అవినీతిమయంగా మారింది. అర్హులకు రావాల్సిన ఉద్యోగాలు డబ్బులు ఉన్నవాళ్లకి వస్తున్నాయి. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే.

**– కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తగూడెం**

### ఏజెన్సీ ద్వారా నియామకాలు వద్దు..



అవుట్ సోర్సింగ్ నియామకాలు ఏజెన్సీల ద్వారా జరపకుండా ప్రభుత్వమే చేపట్టాలి. లేదంటే అవినీతి రాజ్యమేలుతుంది. అందుకే నిరుద్యోగుల వద్ద రూ.లక్షలు వసూళ్లు చేసి ఉద్యోగాలు ఇస్తున్నారు. గతంలో ఆరోపణల వల్లనే ప్రిన్సిపాల్‌ను బదిలీ చేశారు. అయినా మళ్లీ అవే అక్రమాలు జరుగుతున్నాయి. అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడదు.

**– అన్నవరపు కనకయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి**

# వినతులను త్వరితగతిన పరిష్కరించండి

## గ్రీవెన్స్‌లో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 : అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలపై బాధితులు సమర్పించిన వినతులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం ప్రజావాణి నిర్వహించిన కలెక్టర్.. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న ఆగుళ్ల మల్లేశం, ఇల్లెందు నియోజకవర్గం కామేపల్లి మండలం ఊటుకూరుకు చెందిన వడ్లకొండ భిక్షం, బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన శ్రీరాముల సక్కుబాయి, బూర్గంపాడు మండలం కొమ్ముగూడెం పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ తమ సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- సీసీ రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల



ఖమ్మం 18వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబర్ 4:సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం నగరంలో సోమవారం పర్యటించిన ఆయన.. 18వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో 1.75 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రోడ్డు వెడల్పును వర్క్ ఆర్డర్ ప్రకారం చేపట్టాలని, పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా డ్రెయిన్లపై షాపులు, ఆక్రమణలు చేపట్టవద్దని సూచించారు. నదుల్లో ఇళ్ల నిర్మాణాలు; కాల్వలు, చెరువు అలుగుల ఆక్రమణలతో ప్రజలకు కష్టాలు వచ్చాయని, మొన్నటి మున్నేరు వరదలకూ ఇవే కారణమని అన్నారు. అలాగే, నగరంలో ఖాళీ ప్లాట్లలో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరబోవని అన్నారు. పరిశుభ్రత పాటించడాన్ని ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రాయల నాగేశ్వరరావు, పునుకొల్లు నీరజ, డాక్టర్ శ్రీజ, మందడపు లక్ష్మీ మనోహర్, కమర్తపు మురళి, మేడారపు వెంకటేశ్వర్లు, రంజిత్, కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగోన్నతి పొందిన వారికి పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 4 : ఉద్యోగోన్నతి పొందినా పూర్తి వేతనాలు చెల్లించకుండా.. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ మినీ టీచర్ నుంచి మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయి ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్ల వేతనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం, మోసం చేస్తున్నదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం టీచర్లకు పూర్తి వేతనాలు చెల్లించడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు హెల్పర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా రవికుమార్, సత్య, విజయశీల, కృష్ణవేణి, సూరమ్మ, భాను, సావిత్రి, లక్ష్మి, దుర్గ, చంద్రకళ, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

# వెట్టిచాకిరి చేయిస్తే కేసులు

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, నవంబర్ 4 : పిల్లలను పనిలో పెట్టుకున్నా, వారితో వెట్టిచాకిరీ చేయించినా బాల కార్మిక చట్టం ప్రకారం కేసు నమోదు చేయిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి హెచ్చరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం కొత్తగూడెం సూపర్‌బజార్‌లోని రెసిడెన్షియల్ హోటళ్లు, లాడ్జీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. తనిఖీల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహ్మద్ షర్ఫుద్దీన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్‌రావు, న్యాయవాది రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పత్తి కొనాలని ఏఐపీకేఎస్ ధర్నా

- ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి
- ముగ్గురు మంత్రులున్నా రైతులకు మద్దతు ధర అందడం లేదాయె..
- పత్తి క్వింటాకు రూ.17 వేల చొప్పున కొనాలని డిమాండ్
- ధర్నాల్లో సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, కెచ్చెల రంగారెడ్డి, గుమ్మడి నర్సయ్య



ఖమ్మం మార్కెట్‌లోని పత్తి యార్డు ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మం వ్యవసాయం/పాల్వంచ, నవంబర్ 4 : రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సీసీఐ నేరుగా రైతుల వద్ద నుంచే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ అనుబంధ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాల్లో సోమవారం ఆందోళనలు నిర్వహించారు. ఖమ్మం ఏఎంసీలోని పత్తి యార్డులో మహా ధర్నా నిర్వహించిన అనంతరం ఆ సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ అధిక వర్షాలు, తెగుళ్లతో ఎంతో కొంత చేతికొచ్చిన పత్తి పంటను నిబంధనల పేరుతో సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదని, దీంతో ప్రైవేటులో అమ్ముకుంటున్న రైతులను వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. జిన్నింగ్ మిల్లుల వద్ద కాకుండా మార్కెట్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా పత్తి క్వింటాకు రూ.17 వేల చొప్పున కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా.. ఇందులో వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు అందడం లేదన్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించిన అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే.. పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో బయట వ్యాపారులకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కనీసం పెట్టుబడులు రాక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే పంట ఉత్పత్తులకు సంబంధించిన రైతుల సమస్యలన్నీ పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పాశం అప్పారావు, ముద్దా భిక్షం, కల్లూరు కిశోర్, బుర్ర వెంకన్న, బానోత్ ధర్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

# కార్తీక మాసాన.. గోదారి తీరాన..

- కార్తీక శోభను సంతరించుకున్న భద్రగిరి
- పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించిన మహిళలు
- దేవస్థానం ఆధ్వర్యంలో గోదారమ్మకు నదీ హారతి



పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



గోదావరి తీరంలో నదీ హారతి ఇస్తున్న అర్చకులు



గోదావరి నది ఒడ్డున పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భద్రాచలం, నవంబర్ 4 : కార్తీక మాసం సందర్భంగా తొలి సోమవారం భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదీ తీరం దీపపు కాంతులతో మురిసిపోయింది. తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో గోదావరి తీరానికి చేరుకున్న భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఒడ్డున భక్తిశ్రద్ధలతో ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. వాటిని గోదావరిలో వదిలి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులతోపాటు నవదంపతులు, అయ్యప్ప దీక్షాపరులు పెద్ద ఎత్తున గోదావరి తీరానికి చేరుకోవడంతో పులకించిపోయింది. అలాగే సీతారామచంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శివాలయానికి చేరుకున్న మహిళలు కార్తీక పూజలు చేసి దీపాలు వెలిగించారు. అర్చకులు ప్రత్యేకంగా భస్మంతో అభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కార్తీక పూజల అనంతరం ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

**వైభవోపేతంగా నదీ హారతి**

కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈవో రమాదేవి, అర్చకులు పవిత్ర గోదావరి నదీ తీరంలో గోదారమ్మకు నదీ హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, ఏవో భవానీకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



గోదావరి నదిఒడ్డున కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు